సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



బీజేపీ నేతపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

రామసముద్రం మండలంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తిపై టీడీపీ నాయకులు చేయి చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. -8లో



ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి పరిహారం

శేషాచలంలో ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు పరిహారం అందిస్తున్నామని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 84 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సింహ వాహనంపై వీరభద్రుడు



సింహ వాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటిలో శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నవగ్రహ హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని యాలివాహనంపై ఊరేగింపు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారు సింహవాహనంపై విహరించారు. ఉత్సవమూర్తుల ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పురవీధుల్లో గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా సాగింది. అడుగడుగునా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కనులారా దర్శించుకుని తన్మయులయ్యారు. భజన గురువు తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్యస్వామి, శేఖర్ స్వామి, రాచరాయ యోగీ స్వామి నేతృత్వంలో నిర్వహించారు.

శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు



ఈఓ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా దేవయదాశాఖ అధికారి విశ్వనాథ్

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని జిల్లాలో శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక యోగభోగేశ్వరస్వామి ఆలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో 18 ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు. ప్రధానంగా రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి, నిమ్మనపల్లె మండలం నేలమల్లేశ్వరస్వామి, తంబళ్లపల్లెలోని మల్లయ్యకొండ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, మదనపల్లెలోని యోగభోగేశ్వరస్వామి, రామసముద్రం మండలం నడింపల్లిలోని వాలీశ్వరస్వామి, రాజంపేటలోని అత్తిరాల త్రేతేశ్వరస్వామి, రైల్వేకోడూరులోని భుజంగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లతోపాటు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రమణ పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అర్చకులు విశ్వేశ్వరప్రసాద్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేశారు.

పులివెందులలో కోలాహలం

- అభిమాన నేత రాకతో అభిమానులు, కార్యకర్తల్లో ఉత్సాహం
- పురవీధుల్లో పర్యటించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సంప్రదాయ నృత్యం చేసిన లంబాడీ మహిళలు



తనను కలవడానికి వచ్చిన అభిమానులు, ప్రజలు, కార్యకర్తలతో సెల్ఫీ తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప/పులివెందుల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో పులివెందుల పట్టణంలో కోలాహలం నెలకొంది. అభిమాన నేత పర్యటిస్తున్నారని తెలుసుకొని చిన్నారులు మొదలు పండు ముదుసలి వరకూ ఆయా రీతిలో అభిమానం ప్రదర్శిస్తూ రోడ్డుపైకి చేరారు. దారి పొడవునా నిలిచి జేజేలు పలికారు. ఆయనా అంతే.. వచ్చిన అభిమానులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ప్రజల విజ్ఞప్తులను స్వీకరించారు. పార్టీ నేతలకు హితబోధ చేశారు. ప్రజాపక్షమే ఏకైక ఎజెండాగా ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మదిలో వైఎస్సార్‌సీపీకి సుస్థిర స్థానముందని, ఎప్పటికీ ప్రజల పక్షమే అని ఎలుగెత్తి చాటాలని దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని మరో నలుగురు నూతన జంటలకు ఆశీర్వాదాలు అందించారు. పార్టీ నేత కుటుంబాన్ని పరామర్శించారు. ఇలా పర్యటన తొలి రోజంతా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బిజీబిజీగా గడిపారు.

లంబాడి మహిళల సంప్రదాయ నృత్యం

పులివెందుల పరిసర ప్రాంతాలకు చెందిన లంబాడి మహిళలు పెద్ద ఎత్తున మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆఫీసుకు చేరుకున్నారు. అభిమాననేతను చూసేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. కార్యాలయం ఆవరణలో లంబాడి సాంప్రదాయ నృత్యం చేశారు. వారి ఆటపాట పార్టీ కార్యకర్తలు, అభిమానులను ఆశ్చర్యపరిచింది. అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడగానే కేరింతలు కొట్టారు.

ఇళ్లు దాటించిన అభిమానం

పులివెందుల పట్టణం కొండారెడ్డి కాలనీ చెందిన చిన్నారి మాబు షరీఫ్‌కు ఉన్న అభిమానం ఇళ్లు దాటి రింగురోడ్డుకు చేరేలా చేసింది. 5 కిలోమీటర్లు కాలినడక వచ్చి మాజీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవాలని సుమారు 5గంటలు వేచి ఉన్నాడు. తొలుత ఆయన హెలిప్యాడ్ వద్ద దిగుతాడని తెలుసుకుని అక్కడే వెయిట్ చేశాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కడకు చేరుకున్నారు. వేచి ఉన్న వారితో కలిసిపోయి ఎలాగైనా కలవాలనే ప్రయత్నం చేశాడు. ఎట్టకేలకు అభిమాన నేతను కలుసుకొని ఫొటో తీయించుకున్నారు.

అభిమాని ఆర్ట్ బహూకరణ

తన చిన్ననాటి ఫొటోపై చేయివేసి నిల్చొన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ట్‌ను ఓ అభిమాని బహూకరించి ఫొటో దిగారు. చూడముచ్చటగా ఉన్న ఆర్ట్ ఫ్రేమ్ వైపు మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు పార్టీ నేతలంతా చూస్తుండిపోయారు. అలాగే విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇద్దరు విద్యార్థినులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మెమోరాండం అందించారు.

అభిమానుల ఇళ్లకు వెళ్లిన మాజీ సీఎం

పులివెందుల పట్టణంలోని పలువురు అభిమానుల ఇళ్లకెళ్లి నలుగురు నూతన జంటలకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించారు. సింహాద్రిపురం మండలశాఖ అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ సుధా, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌రఘురామిరెడ్డి, ఎస్‌బీఅంజద్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ సంస్థ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహరరెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, వేల్పుల రామలింగారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, మరకా శివకృష్ణారెడ్డి, బిదినంచర్ల బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్ క్యాంప్ ఆఫీస్ వద్ద లంబాడీ మహిళల నృత్యం



అభిమాన నేతకు ఆర్ట్ బహూకరణ



విద్యార్థినుల సమస్యలు వింటున్న జననేత వైఎస్ జగన్



డి.లక్ష్మీనరసమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్

హరోంహర.. శంభో శంకర

- నేడు మహాశివరాత్రి
- శైవ క్షేత్రాల్లో ఘనంగా ఏర్పాట్లు
- కొండ కోనలకు భక్తజనం



సంబేపల్లె : విద్యుత్ దీప కాంతులతో వెలుగొందుతున్న మోటకట్ల శివాలయం

కడప కల్చరల్ : శివుడు... భోళా శంకరుడు... భక్తవ శంకరుడు... ఆకు, పండు, పువ్వు, నీరు ఇలా ఏమిచ్చి మనసారా మొక్కినా భక్తులను కరుణిస్తాడు... వరాలు కురిపిస్తాడు... ఆపదలో ఆదుకుంటాడు... అందుకే ఆయన భక్తవ శంకరుడు. అలాంటి స్వామి పండుగ అయిన మహాశివరాత్రి భక్తులకు ఎంతో ముఖ్యమైనది. ఈ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు చేసుకున్నారు. నిర్వాహకులు శివాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.

- ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని ప్రముఖ శివాలయాలు, అందులోనూ అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆలయాల సంఖ్య 15కు పైగానే ఉంది. ఒకప్పుడు ఈ జిల్లాలో శైవం బాగా విరాజిల్లింది. జిల్లాలో వీరశైవ ఆలయాలు ఉండటంతో అటు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా శివరాత్రి సందర్భంగా భక్తులు ఇక్కడికి వస్తుంటారు. పుష్పగిరి, చిట్వేలి, దేవుని కడప తదితర ప్రాంతాలలో శైవ, వైష్ణవాలయాలు పక్కపక్కనే ఉన్నాయి. నిత్యపూజ స్వామిని భక్తులు వైష్ణవ సంప్రదాయంలోనే అర్చిస్తారు. అడుగడుగునా గోవిందనామ స్మరణ చేస్తారు. ఇలా ఎన్నో విశిష్టతలు గల శివాలయాలున్న ఈ జిల్లాలో ఈ పండగను మరింత వైభవంగా నిర్వహిస్తారు. బుధవారం పండగ నిర్వహణకు భక్తులంతా ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకున్నారు.
- జిల్లా అంతటా ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో శివరాత్రి పూజలు నిర్వహించడానికి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం నుంచే భక్తులు అటవీ క్షేత్రాల బాట పట్టారు. మొక్కులు గల భక్తులు ప్రత్యేక వాహనాలను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. సాయంత్రానికి ఆయా క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి.



» శివ పూజకు వేళాయె

అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో శివయ్యకు విశేష పూజలు నిర్వహించనున్నారు. జిల్లాలో లక్షల మంది హాజరయ్యే క్షేత్రాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పొలతల, నిత్యపూజస్వామికోన, అత్తిరాల, భైరవకోన, గుండాల కోన, కపర్థీశ్వర కోన, కన్యతీర్థం, భానుకోట తదితర ప్రాంతాలకు భక్తులు భారీగా హాజరవుతారు. దాదాపు అన్ని ఆలయాలలో బుధవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నారు. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు భజనలు, ప్రవచనాలు, భక్తి గీతాలాపన చేయనున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు.

అడవిలో అలజడి

- గజరాజుల బీభత్సం
- శేషాచలంలో ముగ్గురు మృత్యువాత
- జిల్లా చరిత్రలో తొలిసారిగా పెద్ద ఘటన
- గతంలో పీలేరు పరిధిలోని వ్యక్తిపై దాడి
- అడవికి ఆనుకునే ఉన్న గ్రామస్తులను వెంటాడుతున్న భయం



ఏనుగుల దాడిలో మృతి చెందిన వ్యక్తులు



సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అలజడి రేగింది. పచ్చని చెట్ల మధ్య ఫీంకరిస్తూ ఏనుగులు చేసిన భయోత్పాతం అందోళన రేకెత్తించింది. శివయ్య దర్శనానికి వెళుతున్న భక్తులపై ఏనుగులు దాడి చేసి తుదముట్టించడంతో అలజడి రేగింది. ఇటీవల కాలంలో గజరాజుల ఫీంకారం ఎక్కువైంది. పంట పొలాల్లోకి రావడం.. అడవి సమీప గ్రామాల పరిధిలో అక్కడక్కడా కనిపిస్తుండటంతో అంతటా భయాందోళనలు నెలకొన్నాయి. అందులోనూ పెద్ద ఎత్తున గుంపుగా ఏనుగులు వస్తుండటం ఆందోళన కలిగించే పరిణామం. జిల్లా చరిత్రలో ఎప్పుడూ ఇంతటి పెద్ద ఘటన జరగలేదు.

పండుగ ముందు విషాదం

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం వై.కోట ప్రాంతం నుంచి గుండాలకోనకు వెళ్లే దారి మధ్య నుంచి.. మరో వైపు తలకోనకు వెళుతుండగా పెద్ద ఘటన చోటుచేసుకుంది. పెద్ద ఎత్తున ఏనుగుల గుంపు ఒక్కసారిగా శేషాచలం అడవిలో దాడి చేయడంతో ముగ్గురు మృత్యువాత పడటం, ఇద్దరు గాయపడటం తెలిసిందే. అయితే శివరాత్రికి ముందు రోజు... తలకోన ప్రాంతంలో ఉన్న శివయ్య దర్శనానికి వెళుతున్న వీరిపై గజరాజులు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పండుగ ముందు రోజు ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఉర్లగడ్డపోడు ఎస్సీ కాలనీలోని బాధిత కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

తరుచూ పంట పొలాల్లోకి వస్తున్న వైనం

అన్నమయ్య జిల్లాలో ఇటీవల తరుచూ ఏనుగులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అటవీ సమీప గ్రామాల పరిధిలోని పొలాలు, తోటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో.. నీరు, మేత కోసం కూడా గ్రామాలవైపు వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎప్పుడు ఏనుగులు వచ్చినా అలజడి సృష్టిస్తుండడంతో గ్రామాల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పీలేరు, పుంగనూరు సరిహద్దు ప్రాంతాలతోపాటు రైల్వేకోడూరు మామాండూరు ప్రాంతాల్లో కనిపించాయి.

గతంలో పలు ఘటనలు

అన్నమయ్య జిల్లాలో ఇటీవలి కాలంలో ఏనుగులు బెంబేలెత్తిస్తున్నాయి. గత ఏడాది అక్టోబరు 17న పీలేరు పట్టణం ఆటోనగర్ సమీపంలో రాజారెడ్డి అనే వ్యక్తిపై ఏనుగుల గుంపు తొక్కి దాడి చేసి చంపేశాయి. అంతకుముందు మదనపల్లె, కలికిరి పరిధిలో పంట పొలాలపై దాడి చేసి పెద్ద ఎత్తున నష్టం కలిగించాయి. ప్రస్తుతం ఓబులవారిపల్లె మండల పరిధిలోని శేషాచలం అడవిలో పెద్ద ఎత్తున ఏనుగుల గుంపు వచ్చి మనుషులను తొక్కి చంపివేయడంతో అటవీ సమీప గ్రామాల పరిధిలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళన గ్రామస్తుల్లో నెలకొంది.

కళ్ల ముందే నా భార్యను చంపేశాయి



మా గ్రామం నుంచి ఎనిమిది మంది కలిసి వెళ్లాము. రాత్రి భోజనం చేసిన తరువాత అర్ధగంట అడవిలో లైట్లు వేసుకొని నడుచుకొంటూ ఒకరి వెనుక ఒకరు వెళ్తున్నాము. రాత్రి ఒంటి గంట సమయంలో ముందు వెళ్తున్న తిరుపతి చెంగలరాయుడు ఏనుగులు ఉన్నాయని గమనించాడు. ఈ విషయం మాకు ఎవరికీ చెప్పలేదు. అతని వద్ద ఉన్న టిఫిన్ క్యారియర్‌తో చప్పుడు చేశాడు. దీంతో ఏనుగుల గుంపు ఒక్క సారిగా వెనుదిరిగి.. చివరలో వస్తున్న నా భార్య మణెమ్మపై ఒక్కసారి దాడి చేశాయి. నా కళ్ల ముందే అక్కడికి అక్కడే చంపేశాయి. నేను పరుగులు తీసి పెద్ద చెట్టు చాటున దాక్కొన్నాను.

– తుపాకుల సిద్దయ్య, ఎస్టీ కాలనీ, రైల్వేకోడూరు మండలం

క్లుప్తంగా

10 మంది జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : వేర్వేరు చోట్ల పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 10 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి 32 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని రాచవేటివారిపల్లె, నిమ్మనపల్లెలో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. రాచవేటివారిపల్లె గ్రామంలో నిర్వహించిన దాడిలో ఎస్.రాజశేఖర్‌రెడ్డి, జి.శ్రీనివాసులు, పి.రెడ్డిశేఖర్, ఎం.స్వామినాథ, ఏ.రాజశేఖర్‌రెడ్డి, వైనజీర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27,870 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నిమ్మనపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్న కర్ణాటకకు చెందిన బీసీ ఆదినారాయణ, సైదాపేటకు చెందిన మహమ్మద్‌రఫీ, కర్నాటక బాగేపల్లెకు చెందిన శంకర, నిమ్మనపల్లె దిగువ వీధికి చెందిన మదన్‌లాల్‌సింగ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.4,140 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


బండి శేషయ్య (ఫైల్)

రాజంపేట టౌన్ : ఈనెల 22వ తేదీ పట్టణంలోని సబ్ స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తుమ్మల అగ్రహారానికి చెందిన గూడూరు శేషమరాజు అలియాస్ బండి శేషయ్య మంగళవారం మృతి చెందాడు. ఎడ్ల బండి తోలుతున్న సమయంలో బస్సు ఢీకొనడంతో శేషయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కారు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె అమ్మచెరువుమిట్టకు చెందిన వెంకటరమణ(44), అతడి భార్య పద్మావతి(37), బీకే పల్లెలో ఉంటున్న అతడి చెల్లెలు లత(35) ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంలో కోటకొండ నుంచి మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో ముదివేడు ఫ్లైఓవర్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని చీకలబైలు గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. స్థానికుడైన వెంకటరమణ భార్య మంగమ్మను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె నుంచి రూ.1,600 విలువ కలిగిన 40 కర్ణాటక టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి రూ. 10 లక్షలు పరిహారం

- చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం సాయంతో నగదు రహిత చికిత్స
- శివరాత్రి సందర్భంగా భక్తులు అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదు
- గుండాలకోన శివాలయం దగ్గరకు నలుగురు భక్తులకు మాత్రమే అనుమతి
- జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ వెల్లడి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : అటవీ ప్రాంతంలో ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ. 10 లక్షలు పరిహారం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓబులవారిపల్లి మండలం, వైకోట సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఏనుగుల దాడి నేపథ్యంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సూచనలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 2.30 గంటల మధ్యలో ఉర్లగడ్డపోడు, కన్నెగుంట ఎస్టీ కాలనీలకు చెందిన కొంతమంది శివ భక్తులు కేవీ బావి బీట్ రేంజ్ నుంచి తలకోన శివాలయానికి అడవి మార్గాన ప్రయాణమయ్యారన్నారు. వై.కోట గ్రామం, కేవీ బావి బీట్ రేంజ్ పరిధిలో ఏనుగు గున్నలు కనిపించడంతో వాటిని పారదోలేందుకు వారివద్ద ఉన్న గిన్నెలతో శబ్దాలు చేయడంతో తల్లి ఏనుగులు తమ బిడ్డలకు ఏమో జరుగుతుందన్న భయంతో శివ భక్తులపై దాడి చేశాయన్నారు. దాడిలో ముగ్గురు వ్యక్తులు చనిపోగా, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయని, మరో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు భక్తులను రిజర్వ్ అటవీ ప్రాంతం నుంచి వెళ్లకూడదని హెచ్చరించినప్పటికీ వారు వినిపించుకోలేదన్నారు. చనిపోయిన వారికి పరిహారం అందివ్వగా గాయపడి చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం సహాయంతో నగదు రహిత చికిత్స అందిస్తున్నామన్నారు. గాయపడిన వారికి రెండు లక్షల రూపాయలు పరిహారం ప్రకటించినట్లు తెలిపారు.

అటవీ ప్రాంతాల్లోకి వెళ్లరాదు..

శివరాత్రి సందర్భంగా భక్తులు ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని జిల్లా కలెక్టర్ భక్తులకు వివిధ సూచనలు చేశారు. బుధవారం శివరాత్రి పండుగ సందర్భంగా అటవీ ప్రాంతాలలో ఉన్న శివాలయాల వద్దకు భక్తులెవరూ అడవి లోపలకు వెళ్లకూడదన్నారు. అడవిలో ఏనుగుల సంచారం అధికంగా ఉందన్నారు. అడవి లోపలకు టపాసులు తీసుకెళ్లరాదని సూచించారు. శివాలయాలకు వెళ్లేటప్పుడు అధికారిక రహదారులను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. గుండాలకోన శివాలయానికి వెళ్లే భక్తులకు కూడా సూచనలు చేస్తామన్నారు. ప్రస్తుతం పరిస్థితుల దృష్ట్యా నలుగురిని మాత్రమే శివుడి ప్రతిమను తీసుకెళ్లేందుకు అనుమతించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ మధుసూదన రావు పాల్గొన్నారు.

గుండాలకోన రాకపోకలకు అనుమతులు రద్దు

ఓబులవారిపల్లె : దారి తప్పిన ఏనుగుల వల్ల మళ్లీ ప్రమాదం ఉంటుందన్న అటవీ శాఖ అధికారుల హెచ్చరికలతో మండలంలోని గుండాల కోన నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ మల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలం శివారు గ్రామాల అడవుల్లో ఏనుగులు దారితప్పి తిరుగుతున్నాయని రాయచోటి అటవీ శాఖ జిల్లా అధికారులు తెలిపారన్నారు. అందువల్ల గుండాలకోనలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయానికి రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అటవీ శివారు గ్రామాల రైతులు పంట పొలాల వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మదనపల్లె : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం బుడుగుంటుపల్లి, ఉలగడ్డ పోడు గ్రామపంచాయతీలో ఏనుగుల దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా అధ్యక్షుడు గంగాధర్,ఉప ప్రధాన కార్యదర్శి సలీం బాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే భక్తుల ప్రాణాలు గాలిలో కలిసి పోయాయన్నారు.

మృతుల కుటుంబాలకు అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 10 లక్షల రూపాయలు ప్రకటించడం సరిపోదని 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గాయపడిన వారికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : తలకోన అటవీ మార్గంలో ఏనుగల దాడిలో గాయపడిన వారిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పరామర్శించారు. ఉర్లగడ్డపోడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పరిగల రాజశేఖర్‌ను తిరుపతి అమర్ హాస్పిటల్‌లో పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.

అనుమతి లేకుండా ఎవరూ అడవిలోకి వెళ్లరాదు

ఎస్పీ విద్యాసాగర్ నాయుడు


వై.కోట అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ఓబులవారిపల్లె : జంతువులు సంచరించే అడవిలోకి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఫారెస్టు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. మంగళవారం రాత్రి వై.కోట అటవీ శివారు ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు వెళుతూ ముగ్గురు భక్తులు ఏనుగుల దాడిలో మృతి చెందడం బాధాకరమన్నారు. పిల్లలతో సంచరించే ఏనుగులు ప్రమాదకరమని, అవి పరిసర ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాయని ఫారెస్టు అధికారులు చెబుతున్నారన్నారు. గుండాలకోన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేందుకు ప్రజలకు అనుమతి ఇవ్వలేదన్నారు. ప్రతి ఏడాది లాగే నీలకంఠేశ్వరస్వామి గుడిలో నిర్వహించే ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కమిటీ సభ్యులతో మాట్లాడి ఏర్పాట్లు చేయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

టమాటాకు భౌగోళిక గుర్తింపునకు సన్నాహాలు


మదనపల్లె టమాటా భౌగోళిక గుర్తింపు కోసం చెన్నైలో అందజేసిన దరఖాస్తు నమూనా

కురబలకోట : మదనపల్లె టమాటాకు మంచి రోజులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇన్నేళ్లుగా వీటికి ఎప్పుడు ధర ఉంటుందో ఎప్పుడు ఉండదో చెప్పలేని పరిస్థితి ఉంది. ధర లేనప్పుడు రైతులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు మదనపల్లెలోని ఎం-టమాటా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఇక్కడి టమాటాలకు భౌగోళిక సూచిక (జీఐ) కోసం చెన్నైలోని ఐపీఆర్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించినట్లు అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అడ్వైజర్ ఆర్ అండ్‌డీ డాక్టర్ తులసీ రామ్ నాయుడు, అసోసియేట్ డీన్ ఆర్‌అండ్‌డీ డాక్టర్ శివయ్య మంగళవారం తెలిపారు. మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల మేధో సంపత్తి సౌకర్యాల కేంద్రం (ఐపీఎఫ్‌సీ) కూడా ఇందుకు సహకరిస్తోంది. చట్టపరమైన ప్రతినిధిగా వ్యవహరిస్తోంది. మదనపల్లె టమాటాకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండెక్స్) వస్తే విదేశాలకు కూడా విరివిగా ఎగుమతి చేసుకోవచ్చు. తద్వారా ఇక్కడి టమాటాకు ఆశించిన ధరలతో పాటు గిట్టుబాటు లభించే అవకాశం ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా మదనపల్లె టమాటకు ప్రత్యేక గుర్తింపు ఉంది. విభిన్న రుచి, రంగు ఆపై ఆకృతి ఆకర్షణ ఉంది. రవాణాకు అనుగుణంగా ఉంటోంది. ఇవన్నీ మదనపల్లె టమాటా స్పెషల్‌గా చెప్పవచ్చు. టమాటా సాగుకు కూడా ఈ ప్రాంతాలు పెట్టింది పేరు. రైతులు కూడా ఏ పంట వేసినా వేయకున్నా టమాటాను తప్పనిసరిగా వేస్తారు. ఇందుకు అనుగుణంగా విస్తారంగా టమాటా నర్సరీలు కూడా వెలిశాయి. టమాటా సాగు ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఈ సందర్భంగా మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ మాట్లాడుతూ మదనపల్లె టమాటా భౌగోళిక గుర్తింపు కోసం తమ కళాశాల చట్టపరమైన ప్రతినిధిగా వ్యవహరించడం సంతోషంగా ఉందన్నారు. దీని వల్ల టమాటాకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా డిమాండ్ ఉంటుందన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె : గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తాము సచివాలయం లేదా విద్యుత్.. రెండింటిలో ఏ శాఖకు చెందిన ఉద్యోగులమో తేల్చి తమను ఏకపాలన కిందకు తేవాలని ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ముక్తియార్, గోపీనాథ్, వేదాంత్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గ్రామ సచివాలయాల్లో పనిచేసే 20 కేటగిరిలకు చెందిన ఉద్యోగులు వారికి కేటాయించిన సచివాలయ పరిధిలోని విధులను మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. అయితే. ఎనర్జీ సెక్రటరీ (జేఎల్‌ఎం గ్రేడ్-2) లు మాత్రం గ్రామ సచివాలయ పరిధి దాటి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో సీనియర్ విద్యుత్ ఉద్యోగులతో పాటుగా పనిచేస్తున్నారన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్-2లకు విద్యుత్ శాఖ పాత ఉద్యోగులకు అమలుచేస్తున్న ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్‌ను అమలుచేయాలని, 24గంటలు విధులు నిర్వహిస్తున్నందున సచివాలయ బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకులపై కేసు నమోదు

నిమ్మనపల్లె : కంచే చేను మేసిందన్న చందాన.. మద్యం దుకాణం నిర్వహిస్తున్న ఓ యజమాని.. మద్యాన్ని షాపులో కాకుండా, గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా విక్రయిస్తుండటంపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. నిమ్మనపల్లెలోని పరమేశ్వర వైన్‌షాపు యజమాని మురళీ సామకోటవారిపల్లెకు చెందిన గొల్ల వెంకటరమణకు మద్యాన్ని అందించి, అధిక ధరలకు విక్రయించమని, వచ్చిన లాభాన్ని ఇద్దరూ పంచుకునేవాళ్లు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సామకోటవారిపల్లెలో గొల్ల వెంకటరమణ ఇంటి ముందు మద్యం విక్రయిస్తుండగా, ఎస్‌ఐ తిప్పేస్వామి దాడి నిర్వహించారు. వెంకటరమణ వద్ద నుంచి గోనెసంచిలో ఉంచిన రూ.2,270 విలువ చేసే 11 క్వార్టర్, 3 ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని మురళీ, బెల్ట్‌షాపు నిర్వాహకుడు వెంకటరమణపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమెరికా యూనివర్సిటీతో ఒప్పందం


అమెరికా యూనివర్సిటీతో మిట్స్ అవగాహన ఒప్పందం

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యా సహకారం కోసం అమెరికాలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ మంగళవారం తెలిపారు. పరిశోధన అవకాశాలను మెరుగుపరచుకోవడం, విద్యా ఆవిష్కరణలు, ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, క్రాస్ కల్చర్ లెర్నింగ్‌తో పాటు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా పాఠ్యాంశ అభివృద్ధి అవగాహన తదితర అంశాలతో ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. ఈ ఒప్పందం అంతర్జాతీయ ప్రయత్నాలలో ప్రధానమైన మైలురాయి అని కళాశాల కరస్పాండెంట్ నాదేళ్ల విజయ భాస్కర్ చౌదరి తెలిపారు. అమెరికాలో ఉన్నత విద్యను ఆకాంక్షించే విద్యార్థులకు కొత్త మార్గాలను తెరుస్తుందన్నారు.

షటిల్ ఆడుతూ వ్యక్తి మృతి

మదనపల్లె : షటిల్ ఆడుతూ అకస్మాత్తుగా షటిల్ కోర్టులోనే వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని సుభాష్ రోడ్డుకు చెందిన సుబ్రహ్మణ్యం(53) స్థానికంగా వేరుశనగ గింజల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత 20 ఏళ్లుగా అతనికి ప్రతిరోజు షటిల్ ఆడటం అలవాటుగా ఉండేది. పట్టణంలోని బెంగళూరురోడ్డు ఇండోర్ షటిల్ కోర్టుకు వెళ్లేవాడు. మంగళవారం ఉదయం యథావిధిగా షటిల్ ఆడేందుకు వెళ్లాడు. రెండు ఆటలు ఆడిన తర్వాత అలసటగా ఉండటంతో పక్కకు వచ్చి కూర్చున్నాడు. అంతలోనే ఉన్నట్లుండి అపస్మారక స్థితికి చేరుకుని ముందుకు వాలి పడిపోయాడు. గమనించిన తోటి క్రీడాకారులు హుటాహుటిన బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

మదనపల్లె : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండల పరిధిలోని గుండాలకోనకు వెళ్లే యాత్రికులపై ఏనుగుల మంద దాడి చేయడంతో ముగ్గురు అక్కడికక్కడే మతి చెందిన ఘటనపై సీపీఎం జిల్లా కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా గుండాలకోనకు భక్తులు వస్తారని తెలిసి కూడా తగు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వేసవి కాలం వస్తున్నందున అటవీ ప్రాంతంలో తాగునీరు లేకపోవడంతో వన్యప్రాణులు అటవీ సమీప గ్రామాలలోకి ప్రవేశిస్తాయని తెలిసి కూడా గుండాలకోన సమీపంలో భద్రత ఏర్పాట్లు చేయకపోవడం దుర్మార్గం అన్నారు.

ట్రాక్టర్‌తో ఇల్లు కూల్చేసిన టీడీపీ నేతలు


దిగువ అమిలేపల్లెలో గడ్డపారలతో ఇంటిని కూల్చేస్తున్న టీడీపీ నాయకులు

గుర్రంకొండ : ట్రాక్టర్‌తో ఓ ఇంటిని టీడీపీ నేతలు కూల్చేసిన సంఘటన మండలంలోని అమిలెపల్లె పంచాయతీ దిగువ అమిలేపల్లెలో జరిగింది. బాధితుల కథనం మేరకు గ్రామానికి చెందిన వెంకటేశ్వరాచారి, పద్మావతమ్మ దంపతులు గ్రామంలో రేకుల షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొంతమంది వారిపై కొంతకాలంగా కక్షగట్టి వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వెంకటేశ్వరాచారి పనిమీద మదనపల్లెకు వెళ్లాడు. పద్మావతమ్మ ఇంట్లో ఒక్కరే ఉండగా టీడీపీ నాయకులు నానా దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి దిగినట్లు వారు తెలిపారు. ఇదేమిటని ప్రశ్నించగా ఆగ్రహించిన టీడీపీ నేతలు ట్రాక్టర్‌తో రేకుల షెడ్డును నేల మట్టం చేశారు. గడ్డపారలతో ఇంటి గోడలు మొత్తం కొట్టేసి కూల్చేశారు. తమకు ఎదురు తిరిగితే ప్రాణాలతో విడిచిపెట్టమని హెచ్చరించారు. విషయం తెలుసుకొన్న భర్త వెంకటేశ్వరాచారి గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పట్టపగలే గ్రామ నడిబొడ్డున ఓ ఇంటిని దౌర్జన్యంగా కూల్చేయడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై జిలా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ నాయకుడిపై టీడీపీ నాయకుల దౌర్జన్యం


బీజేపీ నాయకుడు కృష్ణమూర్తిని అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రామసముద్రం మండలం వాలీశ్వరస్వామి ఆలయ వివాదంలో ఎమ్మెల్యే జోక్యంపై ప్రశ్నించినందుకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కృష్ణమూర్తిపై టీడీపీ నాయకులు చేయి చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి పంచాయతీ బలసముద్రం గ్రామ సమీపంలో వెలసిన శ్రీ వాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు లోక్‌నాథ్ దీక్షితులుకు మద్దతుగా మండలంలోని బ్రాహ్మణులు సంఘం తరపున మంగళవారం రామసముద్రంలోని శ్రీ వాలీశ్వరస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వంశపార్యపరంగా లోక్‌నాథ్‌స్వామి దీక్షితులతో వాలీశ్వరస్వామికి పూజలు అందించాలని అలా కాకుండా కమిటీని ఏర్పాటు చేసి వేరే వారిని నియమించడం సరికాదని తెలిపారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అర్చకులకు మద్దతుగా వచ్చిన బీజేపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి ఈ విషయంపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అర్చకుడిని తొలగించేందుకు ఉత్సవ కమిటీకి మద్దతుగా నిలవడం సంస్కారం కాదన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఉద్దేశించి పరుష వ్యాఖ్యలు చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కృష్ణమూర్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అడ్డుకుని దుర్భాషలాడి చేయి చేసుకున్నారు ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కృష్ణమూర్తిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మదనపల్లె : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మినెంట్ చేయాలని.. అప్పటి వరకూ ఆప్కాస్ లోనే కొనసాగించాలని.. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి తిరిగి కార్మికుల శ్రమను దోచుకోవడానికి ఔట్‌సోర్సింగ్.. కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులందరినీ చేర్చాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి హరీంద్రనాథ్ శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఐటీయూసి నాయకులు జి.కృష్ణమూర్తి, కార్మిక సంఘ నాయకులు అధ్యక్షుడు చలపతి నాయుడు, ప్రధాన కార్యదర్శి సాంబశివ నాయక్, కోశాధికారి రామకష్ణ, ఉపాధ్యక్షులు రాజు, కృష్ణప్ప, శ్రీరాములు, గోపాల్, మునుస్వామి, చంద్ర, చిన్నరెడ్డెప్ప, నరసింహులు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

నేడు ఆలయాల్లో పూజలు నిలిపివేస్తూ అర్చకుల నిరసన


రామసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అర్చకులు


రామసముద్రం : రామసముద్రంలోని ప్రధాన ఆలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన పూజలు నిలిపివేసి నిరసన తెలుపనున్నట్లు మంగళవారం అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్. నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీ వాలీశ్వర స్వామికి పూర్వం నుంచి వంశపారంపర్యంగా ప్రధాన అర్చకులుగా లోకనాథ దీక్షిత్ కొనసాగేవారన్నారు. అయితే గ్రామానికి చెందిన పలువురు అర్చకుడిని తొలగిస్తున్నట్లు చెప్పడంతో అర్చకులు హై కోర్టులో పిటిషన్ వేయగా అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై సోమవారం సాయంత్రం మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, ఈఓ రమణ, కమిటీ సభ్యులతో కొండపై సమావేశం ఏర్పాటు చేసి లోకనాథ దీక్షిత్ లు ఉత్సవాల్లో కొనసాగేలా నిర్ణయించారు. అయితే ఉత్సవ కమిటీ సభ్యులు లోకనాథ దీక్షిత్‌ను కాకుండా కర్ణాటకకు చెందిన అర్చకులను నియమించారు. దీనిపై రామసముద్రం మండలంలోని అర్చకులు లోకనాథ దీక్షిత్ కు మద్దతుగా మండలంలోని అన్ని ఆలయాల్లో పూజలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే అర్చకుడు లోకనాథ దీక్షిత్ కొండ కింద బుధవారం మౌన దీక్ష చేయనున్నట్లు తెలిపారు. వీరికి బిజెపి జిల్లా నాయకుడు చెంబకూరు కృష్ణమూర్తి, మండల బీజేపీ కన్వీనర్ ఆనంద్ నాయుడు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రవి స్వామి, బాల స్వామి, నాగరాజ స్వామి, మహేష్, శంకర, మార్కండేయ, మంజునాథ్, అనిల్, సుందరం స్వామి తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న గట్టు కొండ


కాలిపోతున్న గట్టుకొండ

బి.కొత్తకోట : మండలంలోని చలిమామిడి బీటులోని అటవీ ప్రాంతానికి గుర్తు తెలియని వ్యక్తులు అగ్గి పెట్టడంతో మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రంతా కాలుతోంది. అడవిలో మంటలపై సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది గట్టుకొండ, అచ్చమ్మకొన, దయ్యాలవారిపల్లి ప్రాంతాల్లోని అడవిలో మంటలు ఆర్పేందుకు ఉదయం నుంచే శ్రమిస్తున్నారు. అటవీ గ్రామాల ప్రజలతో కలిసి మంటలు ఆర్పుతున్నా అదుపులోకి రావడం లేదు. దీంతో అటవీ సిబ్బంది కమ్ముకున్న పొగ, మంటల సెగలతో అస్వస్థతకు గురయ్యారు. గట్టుకొండ పైవరకు మంటలు వ్యాపిస్తూ వెళ్తున్నాయి.

బోధనలో నూతన మార్గాలను ప్రోత్సహించేందుకే మ్యాగజైన్


అక్షరవాణి మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న కడప, అన్నమయ్య జిల్లాల డీఈఓలు

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం, నూతన విధానాలను అన్నమయ్య జిల్లా అక్షరవాణి మ్యాగజైన్ అందిస్తుందని అన్నమయ్య, కడప జిల్లాల డీఈఓలు సుబ్రమణ్యం, షంషుద్దీన్‌లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డైట్ కళాశాలలో వారు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరమైన అన్నమయ్య అక్షరవాణి అనే మ్యాగజైన్‌తో పాటు కళాశాల బ్లాగును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో శిక్షణ పొందుతున్న ట్రైనీ టీచర్లందరూ బ్లాగును సద్వినియోగం చేసుకుని తమ విద్యా ప్రమాణాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతపై కేసు

బి.కొత్తకోట : చిల్లర అంగడిలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. గుమ్మసముద్రం పంచాయతీ కొండకిందపల్లిలో చిల్లర దుకాణంలో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నందున బి.రామచంద్రారెడ్డి (60) నుంచి రూ.1,400 విలువైన ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.